క్లుప్తంగా

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి



గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం వైద్యారోగ్యశాఖ సూపర్ వైజర్ షేక్ అబ్దుల్ రెహ్మాన్ విద్యార్థులకు టిష్యూస్ గురించి అవగాహన కల్పించారు. ప్లాంట్, యానిమల్ టిష్యూస్‌పై వివరించారు. అనంతరం విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని కలిగించే విధంగా సామాజిక చైతన్య కథలు చెప్పారు. గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వర రావు పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరంలో పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో మాతృదినోత్సవం



గుంటూరు వెస్ట్: లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో మాతృ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు షేక్ లాల్‌వజీర్ మాట్లాడుతూ పిల్లలు తల్లిదండ్రుల విలువ తెలుసుకోవాలన్నారు. నేటి యువతకు తల్లి అంటే విపరీతమైన నిర్లక్ష్యంగా భావిస్తున్నారని తెలిపారు. ప్రతి ఇంట్లో తల్లిపడే కష్టం మాటల్లో వర్ణించలేమని పేర్కొన్నారు. ముఖ్యంగా నేటి విద్యా వ్యవస్థలో నైతిక విలువలు నేర్పడం తగ్గిపోతుందని తెలిపారు. తల్లిపాదాల చెంత స్వర్గముంటుందనే నానుడి నూటికి నూరు శాతం నిజమని తెలిపారు. అనంతరం సీనియర్ సిటిజన్ చందు హనుమాయమ్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెద్ది శివరామ్ ప్రసాద్, ధర్మ కిషోర్, ప్రసన్న, కల్పన, లక్ష్మీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ



నగరంపాలెం: వయో వృద్ధులు, దివ్యాంగులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ అన్నారు. కొత్తపేటలోని సమితి కార్యాలయంలో ప్రతి నెల రెండో ఆదివారంలో భాగంగా వయోవృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, 11 రకాల నిత్యావసరాల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ ఉండి కూడా ఒంటరిగా జీవించే వారికి సహాయ సహకారాలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఉచిత బియ్యం కమిటీ చైర్మన్ పోలేపల్లి వెంకట సుబ్రహ్మణ్యం, పలకలూరి శివరావు, కార్యదర్శి మాదాల ప్రకాష్, కోశాధికారి ఎస్వీ.రమణ, పోలేపల్లి లహరి, మామిడి శ్రావణి, ఎం.పవన్‌కుమార్, మురళీ సాయి, ఏ గోపీ, మామిడి లీలా పాల్గొన్నారు.

కార్మికుల దీక్షకు మద్దతు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. ఆదివారం బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు బి.సూర్యప్రకాష్‌రావుతో కలసి ప్రారంభించారు. వారికి మద్దతుగా దీక్షలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు ముందు మంత్రి నారా లోకేష్ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని.. ఇప్పుడు కార్మికుల సమస్యను పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పిచ్చయ్య, సుబ్బారావు, నవనీతం, అగ్గయ్య, ఆశీర్వాదం, సాంబశివరావు, ఇమాంబి, తుపాకుల నాగేశ్వరరావు, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

కార్మెల్‌మాత సేవలో విశ్వాసులు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై ఉన్న కార్మెల్‌మాతను పలు ప్రాంతాల విశ్వాసులు ఆదివారం దర్శించుకున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో కర్నూలు, నందిగామ, అద్దంకి, నంద్యాల, వెంకటగిరి ప్రాంతాల వారు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. కార్మెల్ కొండను ఎక్కి తలనీలాలు సమర్పించుకున్నారు. మాతను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

• వేసవిలో సృజనకు పదును

వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులు సేద తీరుతున్నారు. నగరంలోని వివిధ పాఠశాలలు, శిక్షణ సంస్థల్లో విద్యార్థుల ఆసక్తి, అభిరుచికి అనుగుణంగా క్రీడలతో పాటు ఆట, పాటలు, చెస్, యోగా, స్కేటింగ్, క్రాఫ్ట్స్ తయారీ, సంగీతం, నృత్య అంశాల్లో శిక్షణనిస్తున్నారు. ఏడాది పొడవునా పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు శిబిరాల్లో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో తమలోని నైపుణ్యాలకు పదును పెడుతున్నారు. తల్లిదండ్రులు వేసవి సెలవుల్లో పిల్లలను వివిధ క్రీడా, ప్రతిభా ప్రదర్శన, కళా రంగాల్లో శిక్షణకు ప్రోత్సహిస్తున్నారు.

– గుంటూరు ఎడ్యుకేషన్



స్కేటింగ్‌లో శిక్షణకు హాజరైన చిన్నారులు



సంగీత వాయిద్యంపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు



చదరంగం ఆడుతున్న విద్యార్థులు



చిత్రలేఖనంలో శిక్షణ పొందిన విద్యార్థులు

పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై ఆదివారం సాహిత్య సభ నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ పాలక మండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ఉపాధ్యక్షులు విజయబాబు, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య జ్యోతి ప్రజ్వలనతో సభను ప్రారంభించారు. నరసింహ జయంతి సందర్భంగా భక్త రక్షణకు భగవంతుడే అవతరించిన విధానాన్ని డాక్టర్ జి.వైదేహి వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ఘట్టాన్ని అలకించడం దేశ క్షేమానికి కారకమని అన్నారు. డాక్టర్ ఆరెటి కృష్ణ కుమారి మాట్లాడుతూ తల్లి పెంపకంలో పిల్లలు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని అన్నారు. కార్యక్రమంలో కోశాధికారి డాక్టర్ మైలవరపు లలితకుమారి, డాక్టర్ మాధవ్‌పెద్ది విజయలక్ష్మి, సామ్రాజ్యం, షేక్ ఖాసింబి పాల్గొనగా, కుమారి జాహ్నవి బృందం భక్తి గీతాలు ఆలపించారు.



మాట్లాడుతున్న వైదేహి

వైభవంగా ఐతానగర్ పేరంటాళ్లమ్మ తిరునాళ్ల

అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న మంత్రి నాదెండ్ల మనోహర్



తిరునాళ్లలో పాల్గొన్న మంత్రి నాదెండ్ల



గౌరమ్మ, వెంకయ్యల విగ్రహాలను ప్రతిష్ఠకు తెస్తున్న దృశ్యం

తెనాలిటౌన్: 200 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఐతానగర్ పేరంటాళ్లమ్మ తిరునాళ్ల మహోత్సవంలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతమని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. స్థానిక ఐతానగర్‌లోని గత నాలుగు రోజులుగా గౌరమ్మ- వెంకయ్య దేవాలయంలో పేరంటాళ్లమ్మ తిరునాళ్ల అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. చివరి రోజు ఆదివారం మధ్యాహ్నం పొంగళ్లు, మొక్కుబడులు, గండ దీపాలు, పసుపు బళ్లు, కరెంటు ప్రభలు, మేక సిడి వంటి సంప్రదాయ వేడుకలు నిర్వహించారు. దేవాలయంవద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఐతానగర్‌కు చెందిన వారే కాకుండా ఎక్కడెక్కడో స్థిరపడ్డ ఆ ప్రాంతవాసులు తిరునాళ్లలో పాల్గొన్నారు. కోర్కెలు నెరవేరిన వారు ఆనవాయితీగా మొక్కుబడులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి పాల్గొని అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. కొంగు బంగారమై కోర్కెలు తీర్చే గౌరమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మంత్రి మనోహర్ ఆకాంక్షించారు. దేవాలయ భక్త బృందం మంత్రి మనోహర్‌ను సాదరంగా ఆహ్వానించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. నన్నపనేని ముకుందరావు, కన్నెగంటి మురళి, జెట్టి రేణుక, ఈదర పూర్ణచంద్, పలువురు భక్త బృంద సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన కళా పరిషత్ ఆహ్వాన నాటికలు

పొన్నూరు: పొన్నూరు కళాపరిషత్ నిర్వహణలో ప్రముఖ బుర్రకథ కళాకారులు పద్మశ్రీ షేక్ నాజర్ శత జయంతిని పురస్కరించుకుని నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్ ఆవరణలోని కళావేదికపై 4 రోజుల పాటు నిర్వహించిన ఆహ్వాన నాటికల పోటీలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముగింపు కార్యక్రమంలో భాగంగా కొలకలూరు శ్రీ సాయి ఆర్ట్స్ నిర్వహణలో గోపరాజు విజయ్ దర్శకత్వంలో 'జనరల్ బోగీలు' నాటిక ప్రదర్శించారు. అనంతరం ఉత్తమ నాటికలకు బహుమతులు ప్రదానోత్సవ సభ నిర్వహించారు. మొదటి బహుమతి జనరల్ బోగీలు.. ద్వితీయ బహుమతి అసత్యం.. తృతీయ బహుమతి చిగురు మేఘం దక్కించుకున్నాయి. న్యాయ నిర్ణేతలుగా డాక్టర్. కె.జి.వేణు, ఏ.వి.శివయ్య వ్యవహరించారు. కళాకారులు, దర్శకులు, నిర్వాహకులను సత్కరించారు. కార్యక్రమంలో కళా పరిషత్ ప్రతినిధులు, పలువురు ప్రముఖులు, కళాభిమానులు పాల్గొన్నారు.



'వామ్మో' టాయిలెట్స్..



నిరూపయోగంగా ఉన్న నమ్మా టాయిలెట్స్

నగరంపాలెం: ప్రజా సౌకర్యార్థం రూ.లక్షల వ్యయంతో నిర్మించిన ఆధునిక పబ్లిక్ టాయిలెట్స్ నిరుపయోగం మారాయి. పట్టించుకునే వారు కరువయ్యారు. కంకరగుంట రైల్వే ఓవర్‌బ్రిడ్జి కృష్ణాశ్రమం సమీపాన 2017లో జీఎంసీ ఆధ్వర్యంలో ఆధునిక పబ్లిక్ టాయిలెట్స్ (నమ్మా టాయిలెట్స్-ఉచిత) నిర్మాణం చేపట్టారు. టాయిలెట్స్ అంచనా విలువ రూ.10 లక్షలతో అదే ఏడాది నవంబర్‌లో ప్రారంభించారు. ప్రారంభించిన తొలినాళ్లల్లో అటుగా రాకపోకలు సాగించే వారు ఎంచక్కా వినియోగించుకున్నారు. కాలక్రమేణా అవి మూతపడ్డాయి. అయినా కొందరు మల, మూత్ర విసర్జన చేసేవారు. అందుబాటులో నీరు, సిబ్బంది లేకపోవడంతో దుర్వాసన వెదజల్లడం మొదలైంది. ఇప్పటికి అటుగా నడిచి వెళ్లేటప్పుడు, మెట్ల మార్గం ద్వారా బ్రిడ్జిపైకి ఎక్కేటప్పుడు భరించలేని వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు. టీడీపీ హయాంలోనే ఈ టాయిలెట్స్‌ను ప్రారంభించారు. అధికారంలో ఉన్నా వాటిని వాడుకంలోకి తేకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కిడ్నీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నెఫ్రాలజిస్ట్ ఫణిశ్రీ

లక్ష్మీపురం: మన శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపించే అతి ముఖ్యమైన ప్రక్రియను చేసే మూత్రపిండాలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని లేదంటే చాలా ప్రమాదం అని ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఆలపర్తి ఫణిశ్రీ తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో నీటిలో సిలికా అనే భార లోహం కారణంగా ఆయా ప్రాంతాల్లో చాలా మంది ప్రజలు మూత్రపిండ సమస్యలకు గురి అవుతున్నారని అన్నారు. అంతేకాకుండా చాలా కాలం నుంచి మధుమేహంతో బాధపడే వారికి, రక్తపోటు అదుపులో ఉండని వారికి, అధికంగా నొప్పులు మాత్రలు వాడే వారికి, డాక్టర్ సలహా లేకుండా మందులు వాడేవారని చెప్పారు. ప్రోస్టేట్ ఉన్న వారికి మరియు వంశపారంపర్యంగా వచ్చే జీన్స్ వలన కూడా మూత్రపిండ సమస్యలు తలెత్తవచ్చు అన్నారు. సాధారణంగా మూత్రపిండ సమస్యలకు గురి అయిన వారిలో కాళ్లు, ముఖం వాపు రావడం, నీరసం అనిపించడం ఆకలి మరియు అరుగుదల తగ్గడం, మూత్రం తక్కువగా రావడం లాంటి లక్షణాలు కనబడతాయి అన్నారు. మూత్రపిండాల అనారోగ్య సమస్యలకు గురి అయిన విషయాన్ని ముఖ్యంగా సీరం క్రియాటిన్, కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్ మరియు అల్ట్రా సౌండ్ పరీక్షల ద్వారా తెలుసుకొనవచ్చు అన్నారు. యూరాలజిస్ట్ డాక్టర్ మన్నే నిశాంత్ మాట్లాడుతూ కొందరిలో కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశం ఉన్నదని వంశపారంపర్యంగా మరి కొంత మందిలో తీసుకునే ఆహారాన్ని బట్టి ఏర్పడతాయని తెలిపారు. కిడ్నీలో రాళ్లు తొలగించే విషయంలో అవి ఏర్పడిన ప్రదేశాన్ని బట్టి వాటి పరిమాణాన్ని బట్టి చికిత్స నిర్ణయించబడుతుందని చెప్పారు. అనంతరం అవగాహన సంస్థ సభ్యులు డాక్టర్ ఆలపర్తి ఫణిశ్రీ, డాక్టర్ మన్నే నిశాంత్‌లను ఘనంగా సత్కరించారు. సమావేశానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, ప్రొఫెసర్ టి.రత్నారావు పాల్గొని ప్రసంగించారు.

చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు

- పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు
- రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

లక్ష్మీపురం: రౌడీ షీటర్ల మంచి నడవడికతో ఉండాలని, చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. తొలుత ప్రతి ఆదివారం రౌడీ షీటర్ల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్న ప్రదేశాల్లో స్టేషన్ రౌడీ షీటర్ల ప్రమేయం ఉన్నట్లు తెలిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా స్టేషన్‌కు వచ్చి సంతాకం చేసి వెళ్లాలని చెప్పారు. పూర్తి నిఘా ఉందన్న విషయాన్ని మరవవద్దని తెలిపారు. ప్రధానంగా సెటిల్‌మెంట్లు, బెదిరింపులు, రౌడీ కార్యకలాపాలు నిర్వహించినట్లు గాని, మద్యం తాగి స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు చిన్న సమాచారం వచ్చిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ గంగా వెంకటేశ్వర్లు

జూన్ 7న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

తెనాలిఅర్బన్: కొల్లిపర మండలం తూములూరు గ్రామంలోని క్రిస్టియన్‌పాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జూన్ 7వ తేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం విగ్రహావిష్కరణకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయంత్రం 5గంటల జరిగే కార్యక్రమంలో అంబేడ్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపకులు, సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. పెద్ద సంఖ్యలో దళిత నాయకులు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో విగ్రహావిష్కరణ కమిటీ సభ్యులు గల్లా జ్ఞానశేఖర్, తెనాలి యోహాన్, కనపర్తి మోహనరావు, కనపర్తి సుధాకర్, బేతాళ భూషణం, మధిర నాగేశ్వరరావు, కనపర్తి జేమ్స్, కనపర్తి అబ్రహాం లింకన్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అబ్రహాం లింకన్, యోహాన్, తదితరులు

ఆర్‌వీఆర్‌జేసీలో ఘనంగా నేషనల్ టెక్నాలజీ డే



ప్రతిభావంతులను అభినందిస్తున్న దృశ్యం

గుంటూరు రూరల్: సాంకేతిక ప్రగతిపై దేశ ఆర్థిక పురోగతి ఆధారపడి ఉందని.. సమాజ శ్రేయస్సే దిశగా విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు దృష్టి సారించాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ కె.జగదీష్ మద్దినేనిలు అన్నారు. జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా ఆదివారం చౌడవరంలోని కళాశాలలో విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణల ప్రదర్శనను నిర్వహించారు. ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్, కళాశాల డైరెక్టర్ డా.కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖరరావు, డాక్టర్ కె.శోభ, డాక్టర్ సజ్జా రాధిక, డాక్టర్ కె.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం మూసివేతతో ఇక్కట్లు

తెనాలిఅర్బన్: మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా షెడ్డు వద్ద ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం గత ఏడాది చివరి నుంచి పనిచేయడం లేదు. తెనాలి, పరిసర గ్రామీణ ప్రాంత ప్రజలు ఆధార్‌లోని మార్పులు, చేర్పులు వంటి వాటి కోసం ఇక్కడకు వచ్చి వాటి సేవలు పొందేవారు. గడువు ముగియడంతో ఆధార్ కేంద్రం మూసివేసినట్లు తెలిసింది. ఆధార్ కేంద్రం మూసివేతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆధార్ కేంద్రం తెరిచే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



చిలకలూరిపేట రూరల్ సీఐని సస్పెండ్ చేయాలి

లక్ష్మీపురం: మాజీ మంత్రి విడదల రజనీతో అభ్యంతరకరంగా ప్రవర్తించిన చిలకలూరిపేట రూరల్ సీఐని తక్షణమే సస్పెండ్ చేసి విచారణ చేపట్టాలని కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరరావు (సంగమ్) ఆదివారం డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలు హర్షణీయమం కాదని చెప్పారు.

నేడు డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్

నెహ్రూ నగర్: నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి సోమవారం డయల్ యువర్ కమిషనర్ నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ చాంబర్‌లో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు (0863–2224202) కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఏడు నెలల బకాయిల విడుదలపై హర్షం

లక్ష్మీపురం: ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల బకాయిలు విడుదల చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై ఏపీ ఎంసీఏ జిల్లా అధ్యక్షురాలు టి.ప్రవళిక ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు అమృత్ 2.0 డీపీఆర్‌పై సమావేశం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో అమృత్ 2.0లో భాగంగా సమగ్ర తాగునీటి పథకం అమలుకు రూపొందించిన డీపీఆర్‌పై సలహాలు, సూచనలు కోసం నగరంలోని స్టేక్ హోల్డర్స్, సీనియర్ సిటిజన్స్, ప్రజా ప్రతినిధులకు సోమవారం సమావేశం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో నగర మేయర్, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, సీనియర్ సిటిజన్స్ పాల్గొంటారని చెప్పారు.

వైభవంగా శ్రీ లక్ష్మీ నరసింహుని కల్యాణం

గుంటూరు రూరల్: మండలంలోని నల్లపాడులో కొలువైన శ్రీ పుష్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రం, ఆకాశమల్లేశ్వరస్వామి క్షేత్రంలో ఆదివారం స్వామివారి కల్యాణ మహోత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, స్వామివారికి సుప్రభాత సేవ, లలితాపారాయణం, పూలంగి సేవ, సహస్ర దీపాలంకరణ చేశారు. రాత్రి కార్యక్రమాల్లో భాగంగా స్వామివారి శాంతి కల్యాణ మహోత్సవం కనులపండువుగా జరిగింది. వేదపండితుల నేతృత్వంలో వందలాది మంది దంపతులు పీటలపై కూర్చుని స్వామి కల్యాణ క్రతువులో భాగస్వాములయ్యారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు ఉంటాయని.. మధ్యాహ్నం స్వామివారి తీర్థ ప్రసాదం, మహాన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు అన్నారు.

పెదకాకాని శివాలయంలో ప్రత్యేక పూజలు

పెదకాకాని: స్థానిక శివాలయంలో శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం జరిగిన పూజా కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో నవగ్రహ, రాహుకేతువు పూజలను జరిపారు. అర్చకస్వాములు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తముగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.